రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఆటో బోల్తా : బాలుడు మృతి..

**తలకొండపల్లి, జనవరి 29, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడి కుమారుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన కుటుంబ సభ్యులు పోలీసుల వివరాల ప్రకారం గురువారం సాయంత్రం తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయ పల్లి గ్రామానికి చెందిన బయ్య రమేష్ అనే వ్యక్తి తన సొంత ఆటోతో మహబూబ్నగర్ జిల్లాలోని జడ్చర్ల కు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో మిడ్జిల్ మండలం దాటిన తర్వాత తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ పరిధిలో రమేష్ నడుపుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న తన చిన్నారి కుమారుడు మహేష్(4), క్రింద పడడంతో తన ఆటో అతనిపై పడి తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోనే ఉన్న అతని భార్య యాదమ్మకు గాయాలయ్యాయి. ఆటో తో స్వయం ఉపాధి పొందుతున్న భయ్యా రమేష్ తను నడుపుతున్న ఆటో కిందపడి కుమారుడు మృతి చెందడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు కన్నీరు మన్నీరయ్యారు. జరిగిన సంఘటన తెలుసుకొని తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు.



# టికెట్ టెన్షన్..



- కొలిక్కిరాని మున్సిపల్ అభ్యర్థుల ఎంపిక
- నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు
- షాద్‌నగర్‌లో మొదటి రెండు రోజులూ నామమాత్రంగా దాఖలు
- అగ్రనేతల నాన్చుడు ధోరణిపై ఆశావహుల్లో అయోమయం
- బి-ఫారం దక్కకపోతే ఏ నిర్ణయం తీసుకోవాలని సమాలోచనలు
- ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల కప్పగంతులు షురూ..
- కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి శిబిరాల్లో వలస బాట

**షాద్‌నగర్, జనవరి 29, ప్రభాతవార్త :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలలో అభ్యర్థుల ఎంపికపై ఇంకా నాన్చుడు ధోరణి నడుస్తోంది. నామినేషన్ల ప్రక్రియ రెండువ రోజుకు చేరుకున్నా అగ్రనాయకత్వం నుంచి ఏ ప్రకటనా రాకపోవడంతో ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. ఈనెల 30 సాయంత్రంతో నామినేషన్ గడువు ముగియనుండటంతో తమ అభ్యర్థిత్వాన్ని అగ్రనేతలు పరిగణలోకి తీసుకుంటారో లేదో అన్న భయం పట్టుకుంది. ఒక వేళ టికెట్ రాకపోతే ఏ నిర్ణయం తీసుకోవాలి? ఏ దిశగా భవిష్యత్ ప్రణాళికలు ఉండాలని అనే దానిపై అనుచరులతో సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి సిబిరాల్లో కప్పగంతులు చోటుచేసుకుంటున్నాయి.

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాజకీయం కొత్తపుంతలు తొక్కుతోంది. ద్వితీయ శ్రేణి నేతలు కొందరు కండువా రంగులు మార్చుకుంటూ కొత్తదారులు పడుతున్నారు. అభ్యర్థుల ఖరారు పూర్తయితే మరిన్ని వలసలు అన్ని పక్షాల నుంచి ఉంటాయని భావిస్తున్నారు.

మరోవైపు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఈ ఎన్నికలను తీవ్ర ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఫలితాలను బేరీజు వేసుకున్న ఆయా పార్టీలు ఈసారి ప్రజల్లో పట్టు మరింత పెంచుకోవటానికి ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. చైర్మన్ పీఠంతోపాటు వార్డుల నుంచి కూడా ఆశావహుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నా.. గెలుపు గుర్రాలనే బరిలోకి ఒదలాలన్న సంకల్పంతో తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

నామినేషన్ల తొలి రోజు అయిన బుధవారం కేవలం 5 మంది ఆరు నామినేషన్లు వేయగా, రెండవ రోజు కూడా ఈ సంఖ్య స్వల్పంగానే నమోదైంది. గురువారం వివిధ పార్టీల నుంచి కేవలం 20 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇక శుక్రవారం చివరి రోజు కావడంతో నామినేషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గురువారం వేసిన నామినేషన్లలో బీఆర్ఎస్ నుంచి పదిమంది, కాంగ్రెస్ నుంచి ఐదుంగురు, బిజెపి నుంచి నలుగురు, బీఎస్పీ నుంచి ఒక్కరు చొప్పున నామినేషన్లు వేశారు. 28 వార్డులు ఉండగా కేవలం 25 నామినేషన్లు మాత్రమే ఉండడం గమనార్హం. కొన్ని వార్డుల నుంచి ఇప్పటిదాకా ఒక్క నామినేషన్ కూడా నమోదు కాలేదు.

## చైర్మన్ బరిలో స్పీకర్ ఫ్యామిలీ

### గడ్డం ప్రసాద్ కుమార్తె అనన్య 17వ వార్డు నుంచి నామినేషన్

### జిల్లా వ్యాప్తంగా 266 నామినేషన్లు

**వికారాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో భాగమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ రెండవ రోజు గురువారం ఊపందుకుంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 266 నామినేషన్లు ధాఖలయ్యాయి. వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు గడ్డం అనన్య 17వ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలోని వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 92 మంది అభ్యర్థులు 95 నామినేషన్లు దాఖలు చేశారు. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను 108 మంది అభ్యర్థులు 108 నామినేషన్లు దాఖలు చేశారు. పరిగి మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 40 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు చేశారు. కోడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 19 మంది అభ్యర్థులు 20 నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.



నామినేషన్ దాఖలు చేయటానికి పార్టీ నేతలతో వచ్చిన గడ్డం అనన్య

## రెండవ రోజు ఇలా..

- మూడుచింతలపల్లిలో 42 నామినేషన్లు
- అలియాబాద్‌లో..52
- నాయకులతో కలిసి దాఖలు చేసిన అభ్యర్థులు
- కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

**శామీర్‌పేట, జనవరి 29, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో రెండవ రోజు 24 వార్డులకు సంబంధించి వివిధ మున్సిపాల్టీల నుంచి 42నామినేషన్లు దాఖలు అయినట్లు మూడు చింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మూడుచింతపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న నామినేషన్ల సెంటర్‌లో వివిధ వార్డులకు పలువురు వివిధ పార్టీల వారు, ఇతరులు విచ్చేసి నామినేషన్లు దాఖలు చేశారు. రెండవ రోజు 42నామినేషన్లు అందినట్లు తెలిపారు. బిజెపి-6, కాంగ్రెస్-15, బిఆర్ఎస్-19, ఇతరులు-2 నామినేషన్లు అందినట్లు మొత్తం రెండవ రోజు 42నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరించటం జరిగిందన్నారు. అయితే మొదటి రోజున 9నామినేషన్లు అందిన సంగతి తెలిసిందే. వివిధ పార్టీల అభ్యర్థులు విచ్చేసి వివిధ వార్డులకు నామినేషన్లు అందజేశారు. మూడు చింతలపల్లిలోని 4వ వార్డుకు బిఆర్ఎస్ అభ్యర్థి జామ్ రవి పార్టీ నాయకులతో కలిసి విచ్చేసి తన నామినేషనను ఆర్ఓకు అందజేశారు. ఆయనతో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగ వివిధ పార్టీల నాయకులు కూడ అభ్యర్థులు నాయకులతో కలిసి విచ్చేసి నామినేషన్లను దాఖలు చేశారు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ సెంటర్ వద్ద భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

**అలియాబాద్ మున్సిపాల్టీలో..**

గురువారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో . అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని 20వార్డులలో 52నామినేషన్లు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. వీటిలో బిఎస్‌పి-1, బిజెపి-14, కాంగ్రెస్-12, బిఆర్ఎస్-14, రిజిస్టర్డ్ పార్టీలు-8, ఇతరులు-3 నామినేషన్లు మొత్తం 52 నామినేషన్లు అందినట్లు ఆయన తెలపారు. మొదటి రోజున 16నామినేషన్లు అందినట్లు తెలిపారు. ఇక నామినేషన్ల చివరి రోజు శుక్రవారం ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు అందనున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ సంఖ్యలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పార్టీల వారీగ పలువురు ర్యాలీలుగా విచ్చేసి నామినేషన్లు దాఖలు చేశారు. లాల్‌గడిమలక్‌పేట్‌కు చెందిన 15వ వార్డు నుంచి బిజెపి అభ్యర్థిగా ఎం.రోజారాణి అశోక్ పలువురు నాయకులతో, మహిళలతో కలిసి విచ్చేసి రిటర్నింగ్ అధికారికి తన నామినేషను అందజేశారు.



మూడుచింతలపల్లి 4వ వార్డుకు నామినేషన్‌ను అందజేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి జామ్ రవి



లాల్‌గడిమలక్‌పేట్‌లోని 15వ వార్డుకు నామినేషన్ దాఖలు చేస్తున్న బిజెపి అభ్యర్థి ఎం.రోజారాణి అశోక్



## నామినేషన్ కేంద్రాల తనిఖీ

### సిబ్బంది విధుల తీరుపై అబ్జర్వర్ ఆరా

**రంగారెడ్డి అర్బన్, జనవరి 28, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే స్వీకరించాలని జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మిగతా 2లో

## ప్రలోభాలకు ఆశపడకండి

- హైడ్రాను అడ్డుకునే సత్తా బిజెపికే ఉంది
- కేంద్రం నుంచి నిధులు తీసుకు రాగలిగేది మేమే
- మున్సిపాల్టీని అభివృద్ధి చేసి చూపిస్తాం
- బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలో ఎంపి ఈటల



అలియాబాద్‌లో బిజెపి ర్యాలీలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**శామీర్‌పేట, జనవరి 29, ప్రభాతవార్త :** అలియాబాద్ ప్రాంతం బిజెపికి అడ్డా అని, గతంలో బిజెపికి చెందిన సర్పంచులను, ఎంపిటిసిలను గెలిపించిన చరిత్ర అలియాబాద్‌కు ఉందని, ఈ అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లోనూ బిజెపి సత్తా చాటుతుందని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్‌లో బిజెపి అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ర్యాలీలలో ఆయన పాల్గొన్నారు. అలియాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి నామినేషన్స్ సెంటర్ వరకు బిజెపి అభ్యర్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల, పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తుందన్నారు. రేషన్ బియ్యం 5కేజీలు ప్రధాని నరేంద్రమోదీ గ్రామాలకు పంపిణీ చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిందని విమర్శించారు. పెన్షన్లు పెంచలేదని, కొత్త పెన్షన్లు ఇవ్వటం లేదని, నిరుద్యోగభృతి ఇస్తానని నాడు కెసిఆర్ ఇవ్వలేదు..ఇపుడు రేవంత్‌రెడ్డి సైతం ఇవ్వటం లేదని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచారు తప్ప ఒక్క రూపాయి తమ చేతిలో లేదని అంటున్నారని, మళ్లీ గెలిపించినా బిఆర్ఎస్ వల్ల కూడ వచ్చేది ఏమి లేదన్నారు. ఒక్క బిజెపి మాత్రమే కేంద్రం నుంచి నిధులు తీసుకరాగలదని ఎంపి ఈటల స్పష్టం చేశారు. కెసిఆర్, రేవంత్‌రెడ్డి ఇరువురు ప్రజలను మిగతా 2లో



రవికుమార్

## వ్యవసాయ అధికారి రవికుమార్ గుండెపోటుతో హఠాన్మరణం

2



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**తాండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. అభ్యర్థుల నుండి నామినేషన్‌ల స్వీకరణ సరళిపై ఆరాతీశారు. నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి మిగతా 2లో

## కెసిఆర్‌ను వేధిస్తే

### తెలంగాణ ప్రజలు ఊరుకోరు

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్, జనవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్లపాటు తెలంగాణ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన మహానేత కేసీఆర్ పై నిందలు వేసి బదనాం చేసేందుకు ప్రయత్నిస్తే తెలంగాణ ప్రజలు ఊరుకోరని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో భాగంగా నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ పార్టీని, పార్టీ నేతలపై కక్ష కట్టి ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు.

తెలంగాణ ప్రజానీకానికి తాగునీరు సాగునీరు అందించి అపర భగీరథుడుగా పేరుందిన కేసీఆర్‌ను బదనాం చేయాలని చూస్తే ప్రజలుపేక్షిం ం చరని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. విచారణ పేరుతో వేధింపులకు గురి చేస్తే, ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడం తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదని, గత రెండేళ్లుగా విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ, కుట్ర పూరిత రాజకీయాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ పంతాలు మార్చుకోవాలని కోరారు.

ఎన్ని ఇబ్బందులు సృష్టించిన చట్టపరంగా ఎదుర్కొనేందుకు మహానేత కేసీఆర్‌కు అండగా ఉంటామని తేల్చి చెప్పారు.

## రూ.50 వేలు దాటితే ఆధారాలు చూపించాల్సిందే

### నగదు తరలింపుపై ఎస్‌పి స్నేహమెహ్రా స్పష్టీకరణ

**వికారాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లో నుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్ల ు ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం, పంపిణీని కి అ నుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అ నుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు, శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మకపోలింగ్ కేంద్రాల ు క్షేత్రస్థాయిలో సందర్శించాలని ఆదేశించారు.



## సందేహాలు ఉంటే సొంత నిర్ణయం వద్దు: కలెక్టర్

**కొడంగల్, జనవరి 29ప్రభాతవార్త :** నామినేషన్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు.కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకు సంభందించి నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్‌ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్‌లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధృవీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల మిగతా 2లో

## ప్రలోభాలకు ఆశపడకండి

(మొదటి పేజీ తరువాయి)

మోసం చేసినవారే నంటూ ఆయన విమర్శించారు. ఇద్దరి దోపిడి పాలన చూశారు.. ఈ సారి బిజెపికి అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలను కోరారు. పేదల ఇళ్లను కూలగొడుతున్న హైడ్రాను అడ్డుకున్నది బిజెపి మా లాంటి నాయకులు మాత్రమేనని అన్నారు. డబ్బులు, మద్యం చూడవద్దని, బిజెపిని నిస్వార్ధంతో గెలిపిస్తే మున్సిపాల్టీని అభివృద్ధి చేసి చూపిస్తామని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర బిజెపి నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్, మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, మాజీ వైస్‌ఎంపిపి వంగరి హృదయ్‌కుమార్, పలువురు బిజెపి నాయకులు, పార్టీ అభ్యర్థులు, బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఈసారి మాకు అవకాశం ఇచ్చి చూడండి

**కాంగ్రెస్ హామీలన్నీ అటకెక్కించింది**

**ఎంపీ ఈటల రాజేందర్**

**మేడ్చల్, జనవరి 29, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి బీజేపీకి అవకాశం కల్పించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన నామినేషన్ల ర్యాలీ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేసే నాయకులను ఎన్నుకోవాలని, ఇంతరవకు అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చిన ప్రజలు ఈ సారి బీజేపీ పార్టీకి అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చక మోసం చేస్తున్నదని, ఆడబిడ్డలకు రూ 2500, పెండ్లికి లక్ష రూపాయలతో తులం బంగారం, నిరుద్యోగ బృతి నాలుగు వేలు ఇస్తానని వాటిని అమలు చేయలేదని ఆరోపించారు, ఆరు గ్యారంటీలు, 66 హామీలు అటకకెక్కాయని దుయ్యబట్టారు. దేశంలో నరేంద్రమోదీ ప్రధాని అయినఅనంతరం అభివృద్ధి సంక్షేమ పథకాలతో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగిందని, శాంతి భద్రతలు నెలకొన్నాయని అన్నారు. నగరంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే వంతెల నిర్మాణానికి కేంద్రం పూనుకున్నదని తెలిపారు. దోపిడి లేని పాలన కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి,రాష్ట్ర నాయకుడు నందారెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఎన్నికల ఇంచార్జిలు కృష్ణ యాదవ్, రంగారెడ్డి, మహేష్, నాయకులు మోహన్‌రెడ్డి, జగన్ గౌడ్, పుష్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజబొల్లారంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**మేడ్చల్, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి వంచిందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీలోని రాజబొల్లారం, ఘన్‌పేర్ గ్రామాలతో పాటు రాజబొల్లారం తండాలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఈ రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయంలో చేసిన అభివృద్ధి తప్ప ఎక్కడా తట్టెడు మట్టి ఎత్తిన దాఖలాలు లేవని ఆరోపించారు. మంచినీరు, 24 గంటల కరెంట్ అందించిన కేసీఆరే మాకు మల్లి కావాలని గ్రామాల్గో బీఆర్ఎస్ ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్ డెస్క్, నామినేషన్ సెంటర్ల పరిశీలన

**షాద్‌నగర్, జనవరి 29, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని ఇక్కడి హెల్ప్ డెస్క్, నామినేషన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అథారిటీ అధికారి సునీత రెడ్డిను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈసీ నిబంధనలోనూ అనుసరిస్తూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని స్క్రూట్ ని, ఉపసంహరణ వరకు అధికారులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏసీపీ లక్ష్మీ నారాయణ, ఎన్నికల సిబ్బంది తదితరులు ఆయన వెంట ఉన్నారు.



## నామినేషన్ కేంద్రాల తనిఖీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైన సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న అభ్యర్థుల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన నివేదికలను సకాలంలో జిల్లా కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

# మున్సిపల్ నామినేషన్ల జోరు



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి




బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నామినేషన్ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

## పరిగి మున్సిపాలిటీలో 38

**పరిగి, జనవరి 29, ప్రభాతవార్త :** పరిగిలో మున్సిపాలిటీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో రెండో రోజు సాయంత్రానికి 38 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి 12, బిఆర్ఎస్ నుంచి 18, బిజెపి నుంచి 8, స్వతంత్రులు ఐదుగురు గురువారం తమ వార్డుల్లో పోటీ చేయడానికి నామినేషన్ల పత్రాలను అధికారులకు అందించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నామినేషన్ల ప్రక్రియలో పాల్గొన్నారు.. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అభ్యర్థులతో నామినేషన్లు వేయించారు. నామినేషన్ల దాఖలతో వార్డుల్లో ఇప్పటికే నాయకులను, ఓటర్లను మచ్చిక చేసుకునేపనిలో అభ్యర్థులు నిమగ్నమవుతున్నారు.



2వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ దాఖలుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

## కొడంగల్‌లో 20

**కొడంగల్, జనవరి 29, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొడంగల్ మున్సిపాలిటి పరిధిలో గురువారం 20 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 1వ వార్డు నుండి ఎంఐఎం పార్టీకి చెందిన ఒకరు, 2వ వార్డుకు 3 నామినేషన్‌లు దాఖలు కాగా అందులో బిఆర్ఎస్ నుంచి రెండు, కాంగ్రెస్ నుండి ఒక టి ఉన్నాయి. 3వ వార్డులో ఒకరు, 4వ వార్డుకు కాంగ్రెస్ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి ఒకరు నామినేషన్‌లు దాఖలు చేశారు. 6వ వార్డు నుండి బీఆర్ఎస్ నుండి ఒకరు, స్వతంత్ర ఒక అభ్యర్థి దాఖలు చేశారు. 7వ వార్డు నుండి ముగ్గురు దాఖలు చేయగా.. అందులో బిజెపి నుండి ఒకరు, బిఆర్ఎస్ నుండి ఒకరు, ఒక స్వతంత్ర అభ్యర్థి దాఖలు చేశారు. 8వ వార్డు నుండి ఒక స్వతంత్ర అభ్యర్థి, 9వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ నుండి ఒకరు, ఎంఐఎం పార్టీ నుండి ఒకరు, 10వ వార్డు నుండి బిఆర్ఎస్ తరఫున ఇద్దరు, 11వ వార్డు నుండి బిజెపి పక్షాన ఒకరు, బిఆర్ఎస్ నుంచి ఒకరు, 12వ వార్డుకు కాంగ్రెస్ నుంచి ఒకరు, చొప్పున నామినేషన్ పత్రాలు సమర్పించారు. మొత్తం 12 వార్డులకు గాను 20 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇదిలావుండగా బిఆర్ఎస్ పార్టీ నుండి 2వ వార్డుకు పోటీ చేస్తున్న వాణిశ్రీ మధుసుదన్‌యాదవ్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ మున్సిపల్ ఇంచార్జ్ గట్టు రాంచందర్‌రావులు హాజరయ్యారు.



నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అభ్యర్థి.

## తాండూరులో 96

**తాండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** తాండూరులో మున్సిపల్ ఎన్నికలకు సంబందించి నామినేషన్ల పర్వం జోరందుకుంది. రెండో రోజు 96 నామినేషన్లు దాఖలయ్యాయి. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు అభ్యర్థులు పోటా పోటీగా నామినేషన్లు సమర్పించారు. మొదటి రోజు 11 నామినేషన్లు దాఖలు కాగా, గురువారం రెండో రోజు 96 నామినేషన్లు దాఖలు చేశారు.. ఇప్పటి వరకు 107 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు పోటా పోటీగా నామినేషన్‌లు దాఖలు చేశారు. కాంగ్రెస్ 31 నామినేషన్‌లు, బిఆర్ఎస్ పార్టీ 31, బీజేపీ 17, ఎంఐఎం పార్టీ 8, జనసేన 4, స్వతంత్ర అభ్యర్థులు 5 నామినేషన్‌లు దాఖలు చేసినట్లు తాండూరు మున్సిపల్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీలో 78 నామినేషన్లు

**మేడ్చల్, జనవరి 29, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికలో భాగంగా కొనసాగుతున్న నామినేషన్ల దాఖలులో భాగంగా గురువారం 78 మంది నామినేషన్లు వేశారు. అందులో బీజేపీ పార్టీ అభ్యర్థులు 19 మంది, కాంగ్రెస్ అభ్యర్థులు 26, బీఆర్ఎస్ 19 మంది నామినేషన్లు వేయగా ఇంటిపెండెంట్లు 19 మంది వేశారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద భారీ భద్రత

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 29, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మూడు మున్సిపాల్టీలలో నామినేషన్ల స్వీకరణకు శుక్రవారం చివరి రోజు కావటంతో ఆయా సెంటర్లలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం 30వ తేదీ నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావటంతో ఏర్పాట్లపై సంబంధిత పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లపై దృష్టి సారించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగ జరగటానికి సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా సెంటర్లలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లపై సమీక్షించుకోవటం జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు నామినేషన్ల దాఖలుకు అభ్యర్థుల వెంట వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున దీనిపై ఆయా కేంద్రాల్లో సెంటర్లలో కౌంటర్ల వద్ద పకడ్బంధీగ నామినేషన్ల స్వీకరణ జరిగేలా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద జీనోమ్‌వ్యాలీ పోలీసులు, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో నామినేషన్ల స్వీకరణ సెంటర్ వద్ద శామీర్‌పేట పోలీసులు, ఎల్లంపేట్ మున్సిపల్ నామినేషన్ల స్వీకరణ సెంటర్ వద్ద మేడ్చల్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల కోలాహలం కనిపిస్తుంది.

శామీర్‌పేట: అలియాబాద్ మున్సిపాల్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ సెంటర్‌ను, ఏర్పాట్లను మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ సెంటర్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు. సెంటర్‌లో ఏర్పాట్లను, పరిస్థితి గురించి జీనోమ్‌వ్యాలీ సిఐ జి.గురువయ్యను అడిగి తెలుసుకున్నారు. ఇక శుక్రవారం నామినేషన్ల స్వీకరణ మూడవ రోజు (చివరి రోజు) ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు అందవచ్చని పరిస్థితిని బట్టి భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, సిఐ గురువయ్యలు ఏర్పాట్లను మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డికి వివరించారు.



అలియాబాద్ నామినేషన్ల స్వీకరణ సెంటర్‌ను సందర్శించిన మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి, జీనోమ్‌వ్యాలీ సిఐ గురువయ్య, తదితరుల దృశ్యం

# భట్టి వస్తారు.. బడిని చూస్తారు

**మొగిలిగిద్దను సందర్శించనున్న ఉపముఖ్యమంత్రి**

**షాద్‌నగర్, జనవరి 29, ప్రభాతవార్త :** గతంలో స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాన్ని సందర్శించారు.. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నారు.. ఇది శుభ సూచకం.. త్వరలో మొగిలిగిద్ద రూపురేఖలు మారిపోతాయి.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలను శుక్రవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి లతోపాటు అదరపు కలెక్టర్, ఆర్డిఓ, ఎంఈఓ తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాక కోసం జరుగుతున్న ఏర్పాటులను వారు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధికి తాను హామీ ఇచ్చాను అని, వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఇక్కడికి రావడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు పాఠశాల అభివృద్ధి కోసం స్వయాన ఉపముఖ్యమంత్రి ఇక్కడికి వస్తున్నారని, ఇది ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి స్పందిస్తూ ఒకే గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో అప్పుడు ముఖ్యమంత్రి, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి రావడం ఎంతో సంతోషకరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. నేతలు దామోదర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బుగ్గ కృష్ణ, మాజీ ఎంపిటిసి శ్రీశైలం, శ్యామ్ సుందర్, గుట్ట రాజు, మల్లేష్, తవుదు వెంకటేష్, ర్యాకల వెంకటేష్, పటాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



బిఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరికలు

**మేడ్చల్, జనవరి 29, ప్రభాతవార్త :** మేడ్చల్ నియోజకవర్గంలోని ఎల్లంపేట మున్సిపల్ పరిధి సోమారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్ష్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు రమేష్, బలరాం, నాయకులు వెంకటేష్, కృష్ణ, చంద్రశేఖర్, అశోక్, యాదగిరి, బాలేష్, శ్రీనివాస్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు యాదగిరితో పాటు 20 మంది వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, నాయకులు నవీన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి




విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న డైరక్టర్ వెంకటేశ్, ప్రిన్సిపాల్ పరశురాం

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నతమైన ఉద్యోగాలు లభిస్తాయని కళాశాల డైరక్టర్ చిందం వెంకటేశ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు న్ఎఫ్‌సీనగర్‌లోని ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరక్టర్ చిందం వెంకటేశ్, హైకోర్టు న్యాయవాది సందుపట్ల నవజీవన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సిలుపోజు పరశురాంలె మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సీనియర్‌ల వీడ్కోలు కార్యక్రమంలో డైరక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో అందిస్తున్న శ్రీవివేకానంద కళాశాలను విద్యార్థులు వినియోగించుకొని జీవితంలో నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు.

ఈసందర్భంగా విద్యార్థులు ఇంటర్‌లో చదివిన విద్య, ఆటలు, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహం, తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థుల ఆటపాటల ప్రదర్శన జరిగింది. ఉత్తమంగా చదివి మంచి మార్కులు పొందిన విద్యార్థులను డైరక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఓబీ పూర్తి చేయకుండా సామాగ్రి తరలించవద్దు



గురుకుల్ వద్ద సామాగ్రీ తరలింపును అడ్డుకున్న మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు పూర్తి చేయకుండా సామాగ్రిని తరలించకూడదని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ స్పష్టం చేశారు. రైల్వేగేటు అవతల వైపు గురుకుల్ వద్ద నుంచి వంతెన కాంట్రాక్టర్ కూలీలతో సామాగ్రిని మరో చోటుకు లారీలలో తరలిస్తుండగా గురువారం అడ్డుకున్నారు. వంతెన పూర్తి కాకుండా మరో చోట పనులు చేయడం తగదని సామాగ్రిని తరలించవద్దని ఆయన పేర్కొన్నారు. బిల్లులు రావడం లేదని చెబుతున్న కాంట్రాక్టర్ పాత బిల్లులు రాకుండానే కొత్త పనులు ఎలా చేపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఆర్ఓబీ పనుల విషయంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా పొందుతున్నారని అధికారులు నిజానిజాలను ప్రజలకు తెలియజేసి వంతెన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు నామినేషన్‌కు ఏ పత్రాలు జతచేయాలో స్పష్టంగా తెలియజేయాలని, అనుమానాలు ఉంటే వెంటనే నివృత్తి చేయాలని సూచించారు. నామినేషన్‌ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఉన్నతాధికారులకు సంప్రదించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు సంబందించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలకు సంబందించి 100 వార్డులకు గాను 261 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని.. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అదనంగా 20శాతం వరకు ఆర్వోలు, ఏఆర్‌ఓలను నియమించడం జరిగిందని వివరించారు. జిల్లాలో 54 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఆయా పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో నామినేషన్‌లు వేసే అభ్యర్థుల విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే.. పరిశీలన రోజు తగిన ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులు ఖర్చులు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సందేహాలు ఉంటే సొంత నిర్ణయం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను పరిశీలించారు. 1 నుండి 12 వార్డులు 4 కౌంటర్లు, 8 మంది ఆర్ఓలు నామినేషన్‌లు స్వీరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.నామినేషన్‌లు దాఖలు చేసే సమయంలో అభ్యర్దులకు అవసరమైన సహకారం అందించాలని, ఏమైనా సందేహాలు ఉంటే సొంత నిర్ణయం తీసుకోకుండా పై అధికారులను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు.నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌తో పాటు పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.సెన్సిటివ్ లోకేషన్‌లు గుర్తించి పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్,సంభందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్లిన ఎమ్మెల్యే అభిమానులు

## రోడ్డు సమస్య నెరవేరినవేళ
# రామేశ్వరంకు పాదయాత్ర

**నందిగామ, జనవరి 29, ప్రభాతవార్త:** ఎమ్మెల్యేపై అభిమానం.. భక్తి మార్గం అయింది. అస్తవ్యస్తంగా ఉండి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఫరూక్‌నగర్ నుండి వీర్లపల్లి మీదుగా వెంకమ్మగూడ ప్రజలకు,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక నిధులతో బిటి డబుల్ రోడ్డు వేయించి సమస్యలను దూరం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అభివృద్ధి ప్రదాతగా అభివర్ణిస్తూ ఆయన చేసిన సేవకు కృతజ్ఞతగా అభిమానులు రామేశ్వరం దేవాలయానికి గురువారం పాదయాత్రగా వెళ్లారు. మా ఎమ్మెల్యే శంకరయ్యను దీవించి.. మరింత బలాన్ని చేకూర్చుమని ఆ పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు. పాదయాత్రలో వెళ్లిన అభిమానులను వీర్లపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిందం నరసింహులు సన్మానించారు. శ్రీను, సాజిద్, శివ ,భాస్కర్ ,గణేష్, రవి ,అరవింద్ ,ప్రకాష్ ,శ్రీశైలం శ్రవణ్, టేకులపల్లి శివ, అజయ్ తదితరులు ఉన్నారు.

# మంచినీటి వృధాను అరికట్టండి
### మిషన్ భగీరథ పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్

**నందిగామ, జనవరి 29, ప్రభాతవార్త:** వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి వృధాను అరికట్టాలని సర్పంచ్ కొమ్ము కృష్ణ సూచించారు. గురువారం నందిగామ మండల కేంద్రంలోని ఎల్లమ్మరాళ్ల కాలనీలో మిషన్ భగీరథ పైప్ లైన్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమే జీవమని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట ఎఎంసి డైరెక్టర్ సి నర్సింలు, వార్డు సభ్యులు అగ్గి మమత సూరి, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, కిట్టు, నాయకులు ఎర్రగారి రమేష్, పారిశుద్ధ్య సిబ్బంది శంషొద్దీన్ , యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మరాళ్లలో మిషన్ భగీరథ పైపుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్.

# శివనామ స్మరణతో మారుమోగిన నందిగామ
### అత్యంత భక్తిశ్రద్ధలతో సాగిన మహా పడిపూజ
### పూజల్లో పాల్గొన్న సర్పంచ్ కొమ్ము కృష్ణ, ప్రముఖులు



**నందిగామ, జనవరి 29, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలోని ఎస్సి కాలనీలో గురువారం పులిజాల సత్యనారాయణ గురు స్వామి ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామి మహాపడిపూజ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ కొమ్ము కృష్ణ హాజరై పూజలో పాల్గొన్నారు. శివయ్య ఆశీర్వాదంతో అందరికీ మంచి జరగాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించమని సర్పంచ్ భగవంతున్ని వేడుకున్నారు. ఈ మహా పడిపూజలో దీక్షలో ఉన్న శివ భక్తులు కత్తిస్వామి శివగళ్ళ రమేష్ , ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్,

# శివ స్వాములకు అన్న ప్రసాద వితరణ



శివస్వాములతో విశాల యువసేన నాయకులు

**కేశంపేట, జనవరి 29, ప్రభాతవార్త :** దీక్షలో ఉన్న శివస్వాములకు అన్న వితరణ చేయడం ఎంతో ఆనందదాయకమని నేటి యువత చిన్నతనం నుండే భక్తి భావం అలవర్చుకోవాలని భక్తితోనే ముక్తి చేకూరుతుందని కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో గురువారం శివమాల దారుణ స్వీకరించిన భక్తులకు మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి సహకారంతో విశాల యువసేన నాయకులు సరికొండ రమేష్, బోడ క్రిష్ణ మంగలి శేఖర్, ప్రేమ్ చారి, మంగలి శివ, అరుణ్ చారి ఆధ్వర్యంలో 40 మంది శివ స్వాములకు అన్న ప్రసాద వితరణ చేశారు. విశాల శ్రవణ్ రెడ్డి ప్రతి విషయంలో సహకారం అందిస్తారని తెలిపారు. భక్తి భావంలో ముందుండే ఆమె మరోసారి తన ఉదారత చాటుకున్నారని రమేష్ తెలిపారు.

## టిజియుఎస్ దౌల్తాబాద్ మండల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**దౌల్తాబాద్,జనవరి 29,ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారంరోజు మండల విద్యాధికారి వెంకటస్వామి టిజియుఎస్ నూతన సంవత్సర క్యాలెండర్-2026ని ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా టిజియుఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు కె.రమేష్ నాయక్ మాట్లాడుతూ..టిజియుఎస్ సంఘం ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పని చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డి,హన్మంతు గౌడ్, మాధవి ,మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రవి నాయక్,గౌరవ అధ్యక్షులు అంబ్రియా ,సక్రియా నాయక్,పరుశురామ్,సుశీల,రవి నాయక్,ప్రాథమిక సభ్యులు,వివిధ సంఘాల నాయకులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ,సంఘం నాయకులు

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**షాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ముద్దెంగూడ సర్పంచ్ పర్వేద నర్సింహులు అన్నారు. గురువారం షాబాద్ లో ఎఈ కోటేశ్వర్రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామంలో కొన్ని పురాతన విద్యుత్ స్థంబాలు విరిగిపోయాయని, ప్రజలకు ఎలాం టి ప్రమాదాలు జరగకుండా కొత్త స్థంబాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ మతీన్, మాజీ సర్పంచ్ జయమ్మ సుదర్శన్, ఉపసర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు శ్రీశైలం, మల్లేష్ పాల్గొన్నారు.



ఎఈకి వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్

# అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు

-వేముల నర్వలో జెసిబి, టిప్పర్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు కేశంపేట సిఐ నరహరి

**కేశంపేట, జనవరి 29, ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని సిఐ నరహరి తెలిపారు. గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వేముల నర్వ గ్రామం శివారులో సర్వే నెంబర్ 138లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన సిఐ నరహరి తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక జెసిబి, మరియు టీ ఎస్ 12 యు సి 3762 నంబర్ గల టిప్పర్ వాహనాన్ని గుర్తించి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు .ఈ అక్రమ తవ్వకాలలో పాల్గొన్న వేముల నర్వ గ్రామానికి చెందిన తుమ్మల శ్రీను, జెసిబి డ్రైవర్ బాలరాజు,



పోలీసులు స్వాధీనం చేసుకున్న జెసిబి,టిప్పర్

టిప్పర్ డ్రైవర్‌లపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కేశంపేట సిఐ తెలిపారు.అనుమతులు లేకుండా మట్టి లేదా ఇసుక తవ్వకాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలు ఎవరైనా గమనిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు సూచించారు.

# నాణ్యతతో కూడిన బిటి రోడ్లను నిర్మించాలి

**కేశంపేట, జనవరి 29, ప్రభాతవార్త :** ప్రజాధనం వృధా కాకుండా నాణ్యతతో కూడిన బిటి రోడ్లను నిర్మించాలని కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు కరుణాకర్ రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామం నుండి తొమ్మిది రేకుల వరకు 5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులు మండల కాంగ్రెస్ నాయకులు, కాంట్రాక్టర్ గోపాల్ రెడ్డిలో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా బీస కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మారుమూల గ్రామాలకు నాణ్యతతో కూడిన రోడ్లను వేయించడం జరుగుతుందన్నారు. ఇలాంటి రోడ్ల నిర్మాణం వల్ల ప్రజల రవాణా సౌకర్యం సాఫీగా సాగుతుందని ప్రమాదాల నియంత్రణ చాలావరకు తగ్గిందని ఆయన అన్నారు.

ప్రజల అవసరాలు తెలుసుకొని ప్రజల సౌకర్యార్థం బిటి రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ కు, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేష్‌కు కేశంపేట మండల ప్రజలు ,నాయకులు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో బొదునం పల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, మంగళ గూడ సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి, కాకునూరు మాజీ డిప్యూటీ సర్పంచ్ తైద పర్వతాలు, నాయకులు విజయ రెడ్డి, ఐలాపురం హరీశ్వర్ రెడ్డి, కోదూరు శ్రీశైలం, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బిటి రోడ్డు పనులను పరిశీలిస్తున్న మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీస కరుణాకర్ రెడ్డి,తదితరులు

# ముందస్తు ప్రణాళికతోనే విజయం 'పది'లం




టెన్త్ విద్యార్థులతో అనురాగ్ వర్శిటీ ఎన్ఎస్ఎస్ అధికారి మల్లేశ్

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29, ప్రభాత వార్త:** సామాజిక మాధ్యమాలు, ఇతరత్రా కార్యక్రమాలతో సమయం వృధా చేయకుండా పాఠ్యాంశాలను ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని అప్పుడే పరీక్షాల్లో ఉత్తమ శ్రేణుల్లో ఉత్తీర్ణులు అవుతారని అనురాగ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రముఖ కేరీర్ కోచ్ సి.మల్లేశ్ అన్నారు. పోచారం డివిజన్ ప్రతాప సింగారంలోని జడ్పీ హైస్కూల్‌లో 9, 10 వ తరగతి చదువుతున్న దాదాపు 150 మంది విద్యార్థులు త్వరలో జరగనున్న వార్షిక పరీక్షాలకు ఎలా సన్నద్ధం కావాలో తెలిపేందుకు గురువారం కేరీర్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లేశ్ మాట్లాడుతూ విద్యార్థులు దీర్ఘకాలం మనతో ఉండే వాటికి కాకుండా అప్పుడప్పుడు వచ్చేవి పరీక్షలని వాటికి సమయం వెచ్చించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తామని అన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ముందస్తు ప్రణాళికలు వేసుకుని ఎవరికి వారు తాము వెనుకబడిన సబ్జెక్టులకు అధిక సమయం కేటాయించి చదువుకోవాలని సూచించారు. పరీక్షలు అప్పుడప్పుడు వస్తాయని మిత్రులు కుటుంబ సభ్యులు, బంధువులు మనతోనే దీర్ఘకాలం ఉంటారని తెలిపారు. మన భవిష్యత్తును నిర్ణయించేవి చదువు మాత్రమేనని చదువు ద్వారా మన అవసరాలు నేరవేరుతాయని అన్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు వచ్చినప్పుడే కాకుండా ప్రణాళిక బద్ధంగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యే సమయంలో నిరంతరాయంగా చదువకుండా ప్రతి 45 నిముషాలకు ఒకసారి విరామం తీసుకోవాలని, నిత్యం 7 గంటలు నిద్రపోవాలని అన్నారు. చదవడం, వ్రాయడం చేసినప్పుడే చదివినది గుర్తుంటుందని అన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతవాతావరణం ఉండేలా చూసుకుని ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు పొందొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఆర్గనేజైషన్ అధ్యక్షుడు కె. యాదయ్య, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు సాగర్‌రెడ్డి, శ్రీవిద్య, సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేతపై ప్రతీకార రాజకీయాలు సహించం

### రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్

**షాద్‌నగర్, జనవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమాన్ని తెచ్చి తెలంగాణ జాతిపితగా అందరి చేత కొనియాడ పడుతున్న మహా నాయకుడు కేసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ అధికార దుర్వినియోగం అని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ మండిపడ్డారు. ఉద్యమనేతపై ప్రతీకార రాజకీయాలు సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. సిట్ నోటీసులు ఇవ్వడం పై ఆయన స్పందిస్తూ ఈ నోటీసులు ఎందుకు.. తెలంగాణ తెచ్చి నందుకా.. తెలంగాణను ప్రగతి పథంలో నడిపించినందుకా.. తెలంగాణ ప్రజల కోసం ప్రాణాలు బలంగా పెట్టి ఉద్యమం చేసినందుకా.. అని ప్రశ్నించారు. రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చి, రైతుల హృదయాలను దోచుకున్న నాయకుడిని నేరాల్లో ఇరికించే ప్రయత్నం చేయడం రైతులను అవమానించడమే అని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ నాయకత్వంలో చరిత్రత్మకమైన అభివృద్ధి సాధించిందని ఆయన అన్నారు. రైతుబంధు, రైతు భీమా, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం, మిషన్ కాకతీయ వంటివి చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని గుర్తు చేశారు. సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ రంగాలలో విప్లవత్మక మార్పులు తెచ్చి అటు గావు గ్రామాభివృద్ధి, ఇటు పట్టణాభివృద్ధి ద్వారా ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేశారన్నారు. పరిశ్రమలు, ఐటీ పెట్టుబడుల ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొని యాడారు. దళిత బంధు, ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి ఆదర్శ వంతమైన పథకాలను అందజేయడమే కేసిఆర్ చేసిన పాపమాని ప్రశ్నించారు. సంస్కృతి సంప్ర దాయాలకు గౌరవం నుంచి ఇక్కడి ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచిన కేసీఆర్ ను ఎందుకు టార్గెట్ చేశారు రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన రేవం త్‌రెడ్డి రోజుకు డ్రామా ఆడుతూ రాజకీయంగా ప్రజల దృష్టిని మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రేమ విశ్వాసం పొందిన నాయకుడిని దెబ్బతీయడం కాంగ్రెస్ తరం కాదని స్పష్టం చేశారు. కెసిఆర్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న రేవంత్ రెడ్డి ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాలనలో సింగరేణి టెండర్లను అవుకతవకలు, సృజన్ రెడ్డి వ్యవహారంపై సిట్ విచారణ జరగాలన్నారు. కెసిఆర్ పై రాజకీయ కక్షతో ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రజల తీర్పు మా వైపే ఉంటుందని అన్నారు. కెసిఆర్ పై రాజకీయ కక్షతో చేస్తున్న ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# ఐక్య పోరాటాలతో కార్మిక హక్కులు రక్షించుకుందాం

**కొడంగల్,జనవరి 29,ప్రభాతవార్త:** ఐక్య పోరాటాల ద్వారా కార్మిక హక్కులను 29 చట్టాలను రక్షించుకుందామని సిఐటియు జిల్లా కోశాధికారి బుస్స చంద్రయ్య అన్నారు. గురువారం అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బులు వెంటనే చెల్లించాలని కొడంగల్ ఐసిడిఎస్ ఇంచార్జ్ సిడిపిఓకు సమ్మె నోటీసు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త కార్మిక సంఘాల అద్వర్యంలో ఫిబ్రవరి 12 సమ్మె సందర్భంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని రెండు సంవత్సరాలు గడుస్తున్నా టీచర్లకు రెండు లక్షలు,హెల్పర్లకు ఒక లక్ష చెల్లించడంతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని శ్రమశక్తి నీతి 2025 పేరుతో మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కోర్పోరేట్ అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తు కార్మిక వర్గ హక్కుల పరిరక్షణకై ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు అరుణ,కార్యదర్శి సంతోష, పద్మ,బి.యాదమ్మ,రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ సిపిడిఒకు సమ్మె నోటీసును అందిస్తున్న దృశ్యం




# విద్యార్థులు లక్ష్యంతో చదవాలి
### సిఐ వేణుగోపాల్

**మాడ్గుల, జనవరి 29,ప్రభాత వార్త:** విద్యార్థులు చదువులో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మాడ్గుల సిఐ వేణుగోపాల్ అన్నారు.గురువారం మండలంలోని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి.ఆర్.ఆర్. ఫౌండేషన్ మరియు చంద్రన్న ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పరీక్షల కోసం ప్రత్యేకంగా ముద్రించిన రివిజన్ బుక్స్ అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు.విద్యార్థులు అందిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని, విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పి.ఆర్.ఆర్. ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, మంచి మార్కులతో జీవితంలో స్థిరపడేలా కృషి చేయాలని తెలిపారు. చదువు అనేది ఒక్క తరగతికే పరిమితం కాదని, తల్లిదండ్రుల శ్రమను, గురువుల గౌరవాన్ని, గ్రామం పేరును నిలబెట్టేలా ప్రవర్తించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ వంటి తప్పిదాలకు పాల్పడకుండా, మొబైల్ వినియోగాన్ని అవసరమైన పనులకే పరిమితం చేయాలని సూచించారు.అనంతరం మాడ్గుల ఎస్సై రాఘవేందర్, పి.ఆర్.ఆర్. ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతాలు చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందన, నర్మద, కరుణాకర్ రెడ్డి, రియాజుద్దీన్, జగన్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటిఎద్దడి రాకుండా ప్రణాళిక
### : ఎంపిడిఓ పాండు

**పూడూరు, జనవరి 29, ప్రభాతవార్త :** వేసవికాలం సందర్భంగా గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి పాండు సూచించారు.గురువారం పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు,మిషన్ భగీరథ సిబ్బందితో ఫిబ్రవరి1నుండి 20వతేదీవరకు నిర్వహించే సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వివిధ కాలనీల్లో మంచినీటి సమస్య పరిష్కారంకోసం తగిన ప్రణాళికను తయారు చేయాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎఇఎస్ ,డిఇఎస్,ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూడూరులో జరిగిన యాక్షన్‌ప్లాన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ పాండు,తదితరులు

## సమస్యల పరిష్కారం హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తా
### వెంకట్ నరసింహారెడ్డి

**కందుకూరు, జనవరి 29, ప్రభాతవార్త :** కందుకూరు డివిజన్ గ్రామ పాలన అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం కందుకూరు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ జిపిఓ అధ్యక్షులుగా బాకారం వెంకట్ నర్సింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా కే శ్రీహరి ఉపాధ్యక్షులుగా రాయబండి శంకర్ సహాయ కార్యదర్శిగా జగదీష్ గౌరవ అధ్యక్షులుగా యారా కృష్ణ కోశాధికారిగా పి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శిగా భాను శ్రీ మహిళా ఉపాధ్యక్షులుగా, ఎన్ సంతోషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిపిఓల సంఘం డివిజన్ అధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారం హక్కుల పరిరక్షణకు నిరంతరం తన కర్తవ్యాన్ని ఏర్పాటు చేస్తూ సంఘం బలోపేతానికి అంకిత భావంతో పనిచేస్తానని తెలిపారు. గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారంలో జిల్లా కమిటీ ప్రతినిధుల సాయ సహకారాలతో ముందుకు సాగడం జరుగుతుందన్నారు. గ్రామాలలో గ్రామ పాలన అధికారులు ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. దాని ద్వారా పాలకుల నుండి ప్రజల నుండి గ్రామ పాలనాధికారులు తగిన గుర్తింపు పొందుతారని సూచించారు .విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులతో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చిన పంచాయతీ పాలన అధికారులు వివిధ డివిజన్‌ల నుండి హాజరైన ప్రతినిధులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

## కెసిఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్య
### లక్ష్మీ నర్సింహారెడ్డి

**ఆమనగల్, జనవరి 29,ప్రభాత వార్త:** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడం పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యేనని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి ఆరోపించారు.

గురువారం ఆమనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నాయకులను వేధించడమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కెసిఆర్‌కి పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతోందని ఆరోపించారు. చట్టం తన పని తాను చేసుకోవాలి గానీ, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు, నోటీసులతో పైచేయి సాధించాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపారు.సిట్ పేరిట జరుగుతున్న ఈ చర్యలు నిజాల వెలికితీత కోసం కాకుండా పూర్తిగా రాజకీయ దురుద్దేశంతోనే జరుగుతున్నాయని ప్రజలు ఇప్పటికే గ్రహించారని అన్నారు. ఇలాంటి చర్యలతో కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చలేరని,బిఆర్ఎస్ పార్టీని గానీ ఉద్యమ స్ఫూర్తిని గానీ అణచివేయలేరని స్పష్టం చేశారు.ప్రభుత్వం తక్షణమే ఈ రాజకీయ వేధింపులను నిలిపివేయాలని, చట్టాన్ని రాజకీయంగా ఉపయోగించకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రజల తీర్పు నుంచి తప్పించుకునేందుకు చేసే ఇలాంటి వికట ప్రయత్నాలకు తగిన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిటిసి పంతు నాయక్, ఆమనగల్ మండల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్కా నిరంజన్ గౌడ్, ఆనంతుల సైదులు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, చక్రి, అహ్మద్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మి నరసింహ రెడ్డి

## వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి
### ఎంపిడిఓ గ్యామా

**దోమ,జనవరి 29, ప్రభాతవార్త:** వచ్చే వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమ మండల పరిషత్ అబివృద్ధి అదికారి గ్యామా అన్నారు.గురువారం నాడు దోమ మండల పరిషత్ కార్యాలయములో మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, తాగునీటిశాఖ,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భముగ ఆయన మండలములోని 36 గ్రామ పంచాయతీలలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రయత్నాలు చేయాలని సర్పంచులకు సూచించారు.తాగునీరు కోసం ఇబ్బందులు ఉన్న గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రణాళికలు తయారు చేసి పంపించాలని సర్పంచులకు తెలియజేశారు .గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే ట్రాక్టర్‌లను ఉపయోగించి ట్యాంక్‌ల ద్వారా మంచి నీటిని అందించాలని అన్నారు.నీళ్ళ సమస్య ఏర్పడితే వ్యవసాయ బోర్ల ద్వారా అందించాలని కోరారు.ఈ కార్యక్రమములోమిషన్‌భగీరథ గ్రీడ్ ఏఇ కిరణ్,ఇంట్రా మండల నీటిశాఖ అధికారి రవి,మండల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాలొన్నారు.



# యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచిన సిఎం కప్

## యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచిన సిఎం కప్ పోటీలు

**కొత్తూరు, జనవరి 29, ప్రభాతవార్త:** కొత్తూరు మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారని స్థానిక ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. సీఎం కప్ పోటీల్లో కొకో గర్ల్స్: మొదటి స్థానం కొత్తూరు మున్సిపాలిటీ క్లస్టర్, రెండవ స్థానం – పెంజర్ల క్లస్టర్కొకో బాయ్స్: మొదటి స్థానం – కొత్తూరు క్లస్టర్, రెండవ స్థానం –పెంజర్ల క్లస్టర్, కబడి బాయ్స్: మొదటి స్థానం – ఇమ్ముల్లర్వ క్లస్టర్, రెండవ స్థానం – కొత్తూరు క్లస్టర్, కబడి గర్ల్స్: మొదటి స్థానం – కొత్తూరు మున్సిపాలిటీ క్లస్టర్ రెండవ స్థానం – గూడూరు క్లస్టర్, వాలీబాల్ బాయ్స్: మొదటి స్థానం – కొత్తూరు మున్సిపాలిటీ క్లస్టర్, రెండవ స్థానం – ఇమ్ముల్నర్వ క్లస్టర్, వాలీబాల్ గర్ల్స్: మొదటి స్థానం – పెంజర్ల క్లస్టర్రెండవ స్థానం – ఇమ్ముల్నర్వ క్లస్టర్, గెలుపొందిన క్రీడాకారులను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకుడు దేవేందర్ ముదిరాజ్, గూడూరు సర్పంచ్ దయానంద్ గుప్తా, మల్లాపూర్ సర్పంచ్ నరసింహ రెడ్డి, మక్తగూడ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీడీవో అరుంధతి, ఎంఆర్వో రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు మోనాలిసా, నవనీత, శ్రీలతతో పాటు స్థానిక ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, యువతీ యువకులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు,అధికారులు


ప్రారంభిస్తున్న ఎంపిడిఒ అపర్ణ, ఎంఈవో లక్ష్మణానాయక్

## క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు

**షాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సిఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని ఎంపిడిఒ అపర్ణ అన్నారు. గురువారం షాబాద్‌లో పిఆర్ ఆర్ మినీ స్టేడియంలో సిఎం కప్ క్రీడలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామీణస్థాయి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందవి అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్నాయక్, ఇంచార్జ్ పీడీ బాబయ్య, పీఈటీలు సత్యనారాయణ, రాజు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం

ఎంఇఓ గాయత్రి దేవి

**కొందుర్గు, జనవరి 29, ప్రభాతవార్త:** గ్రామాల్లోని పాఠశాల స్థాయి విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సహించేందుకురాష్ట్ర ప్రభుత్వం సిఎం కప్ పేర క్రీడలు నిర్వహిస్తుందని మండల విద్యాధికారిని గాయత్రి దేవి అన్నారు. గురువారం నాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పాఠశాల స్థాయి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి



కల్పించాలనే ఆశయంతోని రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తుందని ప్రతి విద్యార్థి తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆమె కోరారు. క్రీడలు ఆడటం వలన మేధాశక్తితో పాటు పోటీ తత్వము , స్నేహము ఏర్పడుతుందని గ్రామ సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్రనాయక్,ఉప సర్పంచ్ చంద్రశేఖర్ వార్డు సభ్యులు దుర్గం శ్రీనివాస్, మద్ది శ్రీకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరు పాల్గొన్నారు.

## కందుకూరులో సిఎం కప్ 20 26 టోర్నమెంట్ ఈనెల 30. 31 న

**కందుకూరు, జనవరి 29, ప్రభాతవార్త :** కందుకూరు మండలంలో ఈనెల 30. 31 తేదీలలో జరిగే మండల స్థాయి టోర్నమెంట్ మరియు సెలక్షన్ లలో యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆటల పోటీలను విజయవంతం చేయాలని కందుకూరు ఎంపీడీవో సరిత కోరారు. మండల పరిధిలోని రాచులూరు రహదారిపై ఉన్న ఎం జె పి నిషిత కాలేజీలో జరిగే ఈ ఆటల పోటీలు జనవరి 30వ తేదీన వాలీబాల్ మరియు కబడ్డీ ఆటల పోటీలు జరుగుతాయన్నారు. 31వ తేదీన కోకో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హత గల ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని సూచించారు .మరిన్ని వివరాలకు జడ్పీహెచ్ఎస్ పులిమామిడి ఇన్చార్జి పిడిపి స్వామిని సంప్రదించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సిఎం కప్ అటల పోటీలలో ప్రతిభావంతులైన క్రీడాకారులందరూ పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసుకునే అవకాశాన్ని పొందాలని ఎంపిడిఒ సరిత మరియు ఎంఈఓ నరసింహ లు సూచించారు .


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**తలకొండపల్లి, జనవరి 29,( ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ చంద్రధనలో ఆప్తమాలజిస్ట్ లయన్ చంద్రశేఖర్ సహకారంతో 80 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిచారు. కంటి చూపు సమస్యలు ఉన్న 15 మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి వచ్చే వారం కళ్లద్దాలు అందజేస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ అధ్యక్షులు లయన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంఈఓ చంప్లా నాయక్, గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ, ఉప సర్పంచ్ రవీందర్‌రెడ్డి , పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, లయన్స్ క్లబ్ అమనగల్ సెక్రటరీ లయన్ గంప శ్రీనివాస్, కోశాధికారి లయన్ శ్రీనివాసరెడ్డి, లయన్ సభ్యులు లయన్ మోహన్ రెడ్డి, లయన్ పాండు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరవింద్ కుమార్, వార్డు సభ్యులు బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలకే అతీగతీ లేదు

కాంగ్రెస్‌పై మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే ధ్వజం


మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**శామీర్‌పేట, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, ప్రజలను విస్మరించి మోసం చేసిందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే, అలియాబాద్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల సిఎంఆర్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాల్టీ ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగ వ్యవరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పాలనపట్ల తీవ్రంగ విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించటంలో నిర్లక్ష్యం చేస్తుందని, వృద్దుల, వికలాంగు పింఛన్లను పెంచటంలో నిర్లక్ష్యం, రైతు రుణమాఫీ అందరికి ఇవ్వలేదని, మహిళలకు నెలకు 2,500రూపాయలు ఇస్తామని హామీలు చేయలేదని ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. మహిళలే తమతో ప్రత్యక్షంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. హామీలను అమలు చేయటంలో ప్రభుత్వానికి చిత్తశుద్ది లేదని అన్నారు. కొత్త ఫించన్ల విషయం ఆలోచనేలేదని ఆయన ఎద్దేవా చేశారు. అలియాబాద్ మున్సిపాల్టీల్లోని వివిధ గ్రామాల్లో త్రాగునీటి సమస్య, విద్యుత్ కోతలు, వ్యాపారాలతో గృహజీవితాలు దెబ్బతింటున్నట్లు ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు లేవని, అప్పటి పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, ప్రజలు మళ్లీ కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లోల ప్రతి వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థులు పోటీలో ఉంటున్నారని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రణాళిక బద్దంగా పనిచేస్తామని, చైర్మన్ పదవిని కూడ బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమనాయకులు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జెఎసి వెంకన్న, మేకల రామారావుయాదవ్, సాయికృష్ణ, హేమంత్, సుమన్, వంగ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కెపిఆర్ఐటిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల రక్తదానం



కెపిఆర్ఐటిలో రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డైరక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన శిబిరంలో జననీ వాలంటరీ రక్త కేంద్రం ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించి అల్పా హారం, రిఫ్రెష్‌మెంట్స్ అందిం చారు.

కళాశాల స్ట్రాటజీ డైరక్టర్ కొమ్మూరి దివ్య క్యాపు నిర్వహణ పట్ల అభినందించారు. విద్యా ర్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావం మరింత పెరగడానికి రక్త దాన శిబిరం దోహదం చేస్తుందని డైరక్టర్ పేర్కొన్నారు. రక్తం చాలక ప్రాణాపాలయ స్థితిలో ఉన్న రోగులకు అత్యవసరంగా రక్తాన్ని అందించడం వారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేసిన వాలంటీర్లకు డైరక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనాథ్ కశ్యప్‌ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సీఏఓ గుండ నాగరాజు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు పి.రఘురాంరెడ్డి, కె.మదన్, పలువురు డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిధులు ఇస్తా గ్రామాన్ని అభివృద్ధి చేయండి

-గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చ
-ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయం చేస్తామని ఎమ్మెల్యే శంకర్ హామీ

**కొత్తూర్, జనవరి 29, ప్రభాతవార్త:** కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. గురువారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్‌తో పాటు గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన వైద్య ఆరోగ్యశాఖ భవనం, పశు వైద్యశాల, డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్లు తదితర మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాన్ని అన్ని


ఎమ్మెల్యేను కలిసిన సర్పంచ్ ఎర్రోళ్ల జగన్,గ్రామపెద్దలు

రంగాల్లో అభివృద్ధి చేయాలని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్‌ను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, యూత్ కాంగ్రెస్ యూత్ సెక్రటరీ మామిడి ప్రవీణ్ రెడ్డి, దేశాల రమేష్, వార్డు సభ్యులు కమ్మరి వేదాంత చారి, ఎస్.కె. అర్బాస్, కె. మైబూజి, మద్దుల శాంత కుమార్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా : సర్పంచ్


వర్క్‌షెడ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

**మోమిన్‌పేట్,జనవరి 29,ప్రభాతవార్త:** గ్రామస్తులందరి సహకారం ఉంటే గ్రామాన్ని మండలంలోనే కాకుండా జిల్లా లోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తానని వెల్చాల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన వర్క్‌షెడ్ భవన నిర్మాణానికి సర్పంచ్ అధ్యక్షతన వేద పండితులచే భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఇట్టి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారిణి సృజన సాహిత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నేను సర్పంచ్‌గా పూర్తి సమయాన్ని కేటాయించి గ్రామస్తుల సహ కారం ఉంటే నిరంతర కృషితో గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఎంపిడిఒ సృజన సాహిత్య మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైనటువంటి ఈ వర్క్ షెడ్ నిర్మాణం పనులు మండలంలో వెల్చాల్ గ్రామంలో మొట్టమొదటిదని తెలిపారు. అలాగే ఇట్టి నిర్మాణం పనులను యుద్ధ ప్రాతి పదికన పూర్తిచేస్తే డబ్బులు కూడా త్వరగా వస్తాయని ఆమె సర్పంచ్ శ్రీనివాస్‌కు సూచించారు. మార్చి మొదటి వారంలో ఈ భవన నిర్మాణం పూర్తి చేసినట్లయితే పూర్తి డబ్బులు అందే అవకాశం ఉంటుందని కాని పక్షంలో ఆర్థిక సంవత్సరం 2026 నుంచి 2027 కింద డబ్బులు రావడానికి ఆలస్యం అవుతుందని ఆమె తెలిపారు. ఇట్టి భవనం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెంద వచ్చని ఆమె తెలిపారు. తనను సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అలాగే నాకు సహకరిస్తున్న యువ నాయకులకు, గ్రామ పెద్దలకు మండల మరియు జిల్లా స్థాయి అధికారులకు ధన్యవాదలు తెలిపారు. అనంతరం ఎంపీడిఓ వననర్సరిని సందర్శించి నర్సరి నిర్వహణ బాగుందని అలాగే హోంసీడ్ మొక్కలు పెంచి గ్రామంలో ప్రతి ఇంటికి సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యదగిరి, స్థానిక ఉప సర్పంచ్ రమేష్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెదలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎజాజ్ పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వారాల సిరాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంగం డెయిరీ ఉత్పత్తులు నాణ్యతలో అందించాలి

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** వినియోగదారులకు నాణ్యమైన పాలఉత్పత్తులను అందించడంలో సంగం డెయిరీ ముందుంటుందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో గురువారం ఆయన సంగం డెయిరీ వర్షిణి ఎంటర్‌ప్రైజస్ పాల ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. సంగం డెయిరీ తెలంగాణ మేనేజర్ అచ్యుత్‌రావుతో కలిసి సుధీర్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించి ఉత్పత్తులను వినియోగదారులకు అందించారు. బండారి వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఇక్కడ సంగం డెయిరీ డీలర్‌షిప్‌ను పొంది సంగం ఉత్పత్తులను షాప్‌లో ఏర్పాట్లు చేసి అమ్మకాలను మొదలుపెట్టారు. స్వచ్ఛమైన పాలు, పెరుగు, నెయ్యి, పసుపు, కారం, మసాలాలు, పాల మిఠాయిలు, వెన్న, బిస్కెట్లు తదితర ఉత్పత్తులను వినియోగదారులకు విక్రయిస్తామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విచ్చేసిన నాయకులను నిర్వహకులు శాలువాలు కప్పి సన్మానించఇ మిఠాయిలు తినిపించారు. ప్రజలకు, వాహనదారులకు బటర్‌మిల్క్ ప్యాకెట్లు, పాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ సర్పంచులు అబ్బసాని యాదగిరియాదవ్, మెడబోయిన వెంకటేష్, పోతబత్తిని స్టీవెన్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, జంపాల రమేశ్, రేసు లక్ష్మారెడ్డి, నర్రి శ్రీశైలం, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మైసమ్మగుట్ట డైరక్టర్ బొక్క జంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, మేకల పద్మారావు, సహకార సంఘం మాజీ డైరక్టర్లు బొక్క ప్రభాకర్‌రెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎంపాల సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు గడీల రాంచంద్రారెడ్డి, విబి.వెంకటనారాయణ, డాక్టర్ ప్రసాద్, నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, వరికుప్పల లింగస్వామి, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, బొక్క సత్తిరెడ్డి, బొక్క కృష్ణారెడ్డి, పడిగెం వీరేశం, కట్ట సుధాకర్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, రాంనాథ్ పాల్గొన్నారు.


ఎన్ఎఫ్‌సీనగర్‌లో సంగం డెయిరీ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్

## కాంగ్రెస్‌లో సీనియర్లకు ప్రాధాన్యత ఉండదా..?

-పార్టీలు మారే నాయకులకు పదవులు

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీలో సీనియర్లను విస్మరించి బీఆర్ఎస్‌పార్టీ నుంచి వచ్చిన నాయకులకు పదవులు కట్టబెట్టడం తగదని కాంగ్రెస్ నాయకులు కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డిని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్‌ను పలువురు నాయకులు చుట్టుముట్టి ప్రశ్నించారు. ముందు నుంచి కాంగ్రెస్‌పార్టీలో ఉంటూ జెండా మోసిన కార్యకర్తలను అధిష్ఠానం పట్టించుకోకుండా బీఆర్ఎస్‌పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులను గట్టుమైసమ్మగుట్ట దేవాలయ ట్రస్ట్‌బోర్డు కమిటీ సభ్యులుగా నియమించడం ఎంతవరకు సమంజసమని శివప్రదీప్‌రెడ్డి ముత్యాలుయాదవ్‌ను నిలదీశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అన్యాయం చేయకూడదని జిల్లా అధిష్ఠానం వారి సేవలను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## నేడు సుదర్శనహోమం లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణం


ఆలయంలో సుబ్రమణ్యహోమం నిర్వహిస్తున్న అర్చకులు

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వేశ్వరగిరి (హరిహర) క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య వల్లీదేవసేన సమేత కుమారస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, సుబ్రమణ్యస్వామి హోమం, కళ్యాణం నిర్వహించారు. భక్తులు విచ్చేసి భక్తి, శ్రద్దలతో హోమంలో పాల్గొని కళ్యాణం తిలకించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పీఠాధిపతి శ్రీఆత్మానందభారతీస్వామి తెలిపారు. శుక్రవారం శ్రీయోగానంద లక్ష్మీనరసింహ్మస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, సుదర్శనహోమం, లక్ష్మీనర్సింహ్మస్వామి కళ్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## స్వచ్ఛత కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలి


ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

**ఘట్‌కేసర్, జనవరి 29, ప్రభాతవార్త:** నగర పారిశుద్య ప్రమాణాలను మెరుగు పరిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో గురువారం ఆయన పర్యటించి చెత్త నిర్వహణపై ఆరా తీశారు. నాగారం, పోచారం డివిజన్లలోని ప్రాథమిక డంపింగ్ యార్డుల చెత్త సేకరణ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ప్రాథమిక సేకరణ పాయింట్ల పనితీరును పరిశీలించి ద్వితీయ సేకరణ అంశంపై డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణి, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంటింటికి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణను తప్పనిసరిగా అమలు చేయాలని, ఎక్కడ కూడా జీవీపి పాయింట్లు ఉండకుండా పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఘట్‌కేసర్ డివిజన్‌లోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) కేంద్రాన్ని ఏసీ సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వనరులను, పునర్వినియోగం చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్యం మెరుగు పరిచే విధంగా ప్రతిస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి స్వచ్ఛత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారి రవికుమార్ గుండెపోటుతో మృతి

**శామీర్‌పేట, జనవరి 29, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారి రవికుమార్ గుండెపోటుతో మృతిచెందారు. గురువారం మధ్యాహ్నం ఎంసిపల్లి ఎంఎఒ రవికుమార్ ఆకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతిచెందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో ఉంటూ స్వగృహంలోనే తీవ్ర అస్వస్థతకు గురికావటం అంతలోనే గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు తీవ్ర కలత చెందారు. మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారిగా రవికుమార్ (47) పనిచేస్తున్నట్లు అందరి మన్ననలు పొందారని ఆయన మృతి తీరని లోటని పలువురు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. పలువురు రైతుసంఘం నాయకులు, పలువురు నాయకులు ప్రగాఢ సంతాపంను తెలియజేశారు.

